క్లుప్తంగా

సంతలు..

హఫీజ్‌పేట డివిజన్ పరిధిలో

గంగారంలో బుధవారం, హుడా కాలనీలో గురువారం, ఆర్టీసీ కాలనీలో బుధవారం, మదీనాగూడ గ్రామంలో ఆదివారం, మైత్రినగర్ మంజీరా రోడ్డులో శనివారం, ఆల్విన్ కాలనీలో గురువారం, ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో గురువారం, జనప్రియ అపార్ట్‌మెంట్స్ సాయిబాబా ఆలయం వద్ద గురువారం, 5వ ఫేజ్ వద్ద బుధవారం సంత జరుగుతుంది.

మాదాపూర్ డివిజన్ పరిధిలో....

మాతృశ్రీనగర్‌లో సోమవారం, గోకుల్ ప్లాట్స్‌లో పెద్ద చర్చి వద్ద ఆదివారం, 80 ఫీట్ల రోడ్డులో బుధవారం సంతలు నిర్వహిస్తున్నారు.

ఘనంగా విజయ గణపతి విగ్రహ ప్రతిష్ఠ



రాయదుర్గం: గచ్చిబౌలి జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం విజయగణపతి విగ్రహ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. యంత్ర, బింబ, శిఖర ప్రతిష్ఠాపన, అభిషేకాలు చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పాదయాత్ర

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్ బస్తీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై శుక్రవారం చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు డాక్టర్ జి.రంజిత్‌రెడ్డి, స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు.

‘సండే ఈవినింగ్ టాక్

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం ‘సండే ఈవినింగ్ టాక్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ‘హ్యాపీ విమెన్.. హ్యాపీ ఫ్యామిలీ’ అనే అంశంపై సీనియర్ రాజయోగ టీచర్ హైదరాబాద్‌కు చెందిన బికె.లక్ష్మీ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్ 040–23001234లో సంప్రదించాలి.

మార్చి 22న ఉగాది, 30న శ్రీరామనవమి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు గురువారం శ్రీ కోదండ సీతారామస్వామి దేవాలయంలో పర్వదినాల తేదీలపై పటాన్‌చెరు పురప్రముఖుల సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయించినట్టు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. మార్చి 22న ఉగాది, 30న శ్రీరామనవమి నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్, కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, మాజీ జెడ్పీటీసీ జైపాల్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, మనోహర్ రెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప నగేశ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని డివిజన్ కార్పొరేటర్ పుష్ప నగేశ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలో నిర్వహిస్తున్న మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా డ్వాక్రా మహిళలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్ బాలయ్య, ప్రాజెక్ట్ అధికారిణి పుణ్యవతి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్‌లో గురువారం బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు సుంకు వినయ్‌కుమార్ పారిశుద్ధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. బీఎస్పీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు నటరాజ్, కార్యదర్శి సంజీవ్ మాట్లాడుతూ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని పారిశుద్ధ్య, ఆశ కార్మికులను, డ్వాక్రా మహిళలను సన్మానించామన్నారు. కార్యక్రమంలో మోహన్ పాల్గొన్నారు.

ప్రధాన రోడ్లు.. చెత్తమయం

మాదాపూర్: అంతర్జాతీయ సదస్సులకు నిలయంగా ఉన్న హైటెక్ సిటీ మాదాపూర్ పరిసర ప్రాంతాలలో ప్రధాన రోడ్లన్నీ చెత్త కుప్పలతో దర్శనమిస్తున్నాయి. ఈ ఏరియాను విదేశీ ప్రతినిధులు సైతం సందర్శిస్తుంటారు. కాగా స్వచ్ఛ హైదరాబాద్ కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా ఫలితం లేదు. మాదాపూర్‌లోని సర్వే ఆఫ్ ఇండియా, చందానాయక్ తండా, సాయినగర్, అయ్యప్పసొసైటీ, 100 అడుగుల రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తున్నారు. దీంతో ఆ రోడ్ల గుండా ప్రయాణించే వారు ఇబ్బందులుపడుతున్నారు.

- ప్రధానంగా రోడ్ల పక్కన చిరు వ్యాపారులు వ్యర్థాలను వేయడంతో పేరుకుపోతున్నాయి.
- వివాహాది శుభకార్యాలలో మిగిలిపోయిన ఆహార పదార్థాలను రోడ్ల పక్కన పారబోస్తుండడంతో కుక్కలు వస్తున్నాయి.
- తడి, పొడి చెత్తను ఒకేచోట వేయడంతో పరిసరాలు దుర్వాసన వెదజల్లుతున్నాయి.
- పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గాలులు వీచినపుడు చెత్త ఎగిరి వాహనాలపై పడుతోందని వాహనదారులు వాపోతున్నారు.
- రోడ్లపై చెత్త కుప్పలను వేయకుండాఅధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.
- చిరు వ్యాపారులు, మాంసాహార షాపుల నిర్వాహకులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని స్థానికులు అంటున్నారు.
- రోడ్లపై, బహిరంగ ప్రదేశాలపై చెత్త వేసిన వారికి జరిమానా విధించాలని పేర్కొంటున్నారు.
- అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సీనియర్ సిటిజన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త





మాదాపూర్‌లోని సర్వే ఆఫ్ ఇండియా ప్రధాన రోడ్లపై చెత్త కుప్పలు



చందానాయక్ తండా వద్ద ..

కొరియా వర్సిటీతో గీతం ఒప్పందం

పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, కొరియాలోని చియోంగ్జు విశ్వవిద్యాలయంతో గురువారం రెండు అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నట్టు యూనివర్సిటీ బాధ్యులు తెలిపారు. ఐదేళ్ల పాటు అమలులో ఉండే ఒప్పందాలపై గీతం హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, టెక్నాలజీ అసోసియేట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.సీతారామయ్య, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీనివాస్, చియోంగ్జు విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ యోంగ్ జిన్ చుంగ్లు సంతకాలు చేశారు. పరస్పరం ఆసక్తి ఉన్న సమాచారం–పదార్థాల మార్పిడి, అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్, పరిశోధన సిబ్బందిని పరస్పరం మార్పిడికి అంగీకరించాయి. విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌లతో పాటు విమాన– సాంకేతిక సమాచారం పరస్పరం ప్రోత్సహించుకునేందుకు సుముఖత వ్యక్తం చేశాయి. అనంతరం గీతంలో చేపట్టిన పరిశోధనల పురోగతిపై విద్యార్థులతో కొరియా బృందం ముఖాముఖి నిర్వహించారు.



సమావేశమైన విశ్వవిద్యాలయాల సభ్యులు



హాస్పిటల్ ప్రారంభోత్సవంలో మంత్రి జగదీశ్వర్‌రెడ్డి ,ఎమ్మెల్యే గాంధీ తదితరులు

శ్వాస ఆసుపత్రి ప్రారంభం

మాదాపూర్: శ్వాస సంబంధిత జబ్బులలో ఎలర్జీ, ఆస్తమాలు ప్రమాదకరంగా మారుతున్నాయని విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మాదాపూర్‌లోని కావూరిహిల్స్‌లో గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన శ్వాస హాస్పిటల్‌ను ఎమ్మెల్యే గాంధీ, నిర్వాహకుడు డాక్టర్ విష్ణురావు, జర్నలిస్ట్ కె.సత్యనారాయణతో కలసి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నార్నే శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ఒప్పంద కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ జనరల్ భిక్షపతి, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ సతీష్‌కుమార్

ఒప్పందం

మాదాపూర్: మాదాపూర్‌లోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో న్యాక్ డైరెక్టర్ జనరల్ భిక్షపతి, ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్‌కుమార్ పెద్దపల్లి, ఆర్జీయుకేటీ (రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి టెక్నాలజీస్) వీసీ వి.వెంకటరమణలు న్యాక్‌తో ఒప్పందం చేసుకున్నారు. ఇందులో న్యాక్, ఆర్జీయూకేటీ సంయుక్తంగా ఎగ్జిక్యూటివ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలను వర్కింగ్ ఇంజనీర్స్‌కి నిర్వహించనున్నట్టు తెలిపారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్, ప్లేస్‌మెంట్స్‌తో పాటు ఇంజనీరింగ్ విద్యార్థులకు మరిన్ని శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిపారు.

అభివృద్ధిలో మహిళలు భాగస్వాములవ్వాలి



మహిళా ఉపాధ్యాయులను సత్కరించిన హెచ్‌ఎం తాజ్‌బాబు, ఇతర ఉపాధ్యాయులు

గచ్చిబౌలి: అభివృద్ధిలో మహిళలు భాగస్వాములవ్వాలని ఐవీ ఫెర్టిలిటీ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ భారతీసుధ పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మహిళల ఆరోగ్య సమస్యలపై ప్రొజెక్టర్ ద్వారా వివరించారు. ప్రాథమికంగా మహిళలకు ఆరోగ్యం పట్ల ఉండే అపోహలపై , వివిధ రకాల క్యాన్సర్‌లపై అవగాహన కల్పించారు. మహిళా నాయకురాలు కృష్ణకుమారి మాట్లాడుతూ మహిళలకు సమాన హక్కు లభించినప్పుడే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. క్రీడలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీల ఉద్యోగులు,మహిళా నాయకురాలు రేణుకమ్మ, సుందరయ్య విజ్ఞాన కేంద్రం బాధ్యులు సాంబశివరావు, శ్రీనివాసరావు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్‌లో..

రాయదుర్గం: రాయదుర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాజ్‌బాబు ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా ఉపాధ్యాయులు సుధీర క్రాంతి పావని, కృష్ణవేణి, మమత, కమలమ్మ, దేవమణి, రాజేశ్వరి, సునందినిలను సత్కరించారు. కార్యక్రమంలో అంబర్‌సింగ్, ఆంజనేయులు, అంజలయ్య, పాండు శ్రీనివాస్, బాలయ్య , విద్యార్థులు పాల్గొన్నారు.

16 నుంచి డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్‌పై వర్క్‌షాప్

రాయదుర్గం: మనూలోని బోధన మీడియా సెంటర్(ఐఎంసీ) ఆధ్వర్యంలో ఇండియన్ డాక్యుమెంటరీ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ (ఐడీపీఏ) ముంబాయి సహకారంతో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రొఫెషనల్స్, ఇతరులకు డాక్యుమెంటరీ ఫిల్మ్ మేకింగ్‌పై ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు మూడు రోజులపాటు వర్క్‌షాప్‌ను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారు పేర్ల రిజిస్ట్రేషన్‌ను మార్చి 12వ తేదీ వరకు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు నిర్మాత, వర్క్‌షాప్ కన్వీనర్ మహ్మద్ ముజాహిద్‌ను ఫోన్ నెంబర్ 9885389140లో సంప్రదించాలన్నారు.

ముగ్గుల పోటీలు



ముగ్గులను పరిశీలిస్తున్న రోజారాణి తదితరులు

జిన్నారం(పటాన్‌చెరు): మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి సూచించారు. మహిళా దినోత్సవంలో భాగంగా గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు ఆమె బహుమతులు అందించారు. అనంతరం రోజారాణి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషన్ రాజేంద్రకుమార్, ఆయా కాలనీల మహిళలు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గచ్చిబౌలి: రాయదుర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయదుర్గంలోని జేఆర్ కన్వెన్షన్ సెంటర్ సమీపంలోని బస్టాప్ వద్ద ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయాడని డయల్ 100కు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా అతను అప్పటికే మృతి చెందాడని 108 సిబ్బంది నిర్ధారించారు. ఎత్తు 5.3 అంగుళాలు, నీలిరంగు చొక్కా, ఛాతీకి ఎడమవైపు పుట్టుమచ్చ ఉంది. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీ వార్షికోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు టౌన్: విద్యతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే సహకారంతో కళాశాలలో మరిన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. గత ఏడాది ఇంటర్‌లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్‌లో మాక్ డ్రిల్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలో సీఐఎస్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. విపత్తులు, అగ్ని ప్రమాదాలు, ఉగ్రదాడుల సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై సీఐఎస్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది కార్మికులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భెల్ జీఎం శ్యామ్ బాబు, జీఎం హెచ్‌ఆర్ మగేంద్రవర్మన్, అగ్నిమాపక ఇన్‌చార్జ్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌లో సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది

కర్దనూర్‌లో మాల్దీవ్స్ బృందం పర్యటన

- పల్లె ప్రకృతి వనం, నర్సరీ సందర్శన
- గ్రామాభివృద్ధిపై పాలకవర్గానికి అభినందన

పటాన్‌చెరు టౌన్: మండలంలోని కర్దనూర్ గ్రామంలో మాల్దీవ్ బృందం గురువారం పర్యటించింది. గ్రామాల పరిశీలనలో భాగంగా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్డీ) ఆధ్వర్యంలో మాల్దీవ్స్‌కు చెందిన 30 మందితో కూడిన బృందం జిల్లా అధికారులతో కలిసి కర్దనూర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు, పల్లె ప్రకృతి వనం, నర్సరీలు, పారిశుధ్యం, డంపింగ్ యార్డ్‌లను సభ్యులు పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, కంపోస్టు ఎరువు తయారీపై అడిగి తెలుసుకొని వివరాలు నమోదు చేసుకున్నారు. మాల్దీవ్స్ దేశం ఎక్కువగా టూరిజంపై ఆధారపడిందని, వారి వద్ద చెత్త సమస్య తీవ్రంగా ఉందన్నారు. డంప్ యార్డు నిర్వహణను తమ దేశంలోనూ అమలు చేసేందుకు ప్రతిపాదిస్తామన్నారు. ప్రతీ గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి పచ్చదనం పెంపునకు తీసుకుంటున్న చర్యలపై జిల్లా పంచాయతీ అధికారి సురేష్ మోహన్ వారికి వివరించారు. కోతుల ఆహార కేంద్రాన్ని చూసి వావ్.. అంటూ ఆశ్చర్యపోయారు. గ్రామ అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్ ఎర్రోళ్ల విజయలక్ష్మిని, ఉప సర్పంచ్, పాలకమండలిని అభినందించారు. గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, ఆశ వర్కర్ల పని తీరు, పంచాయతీ గ్రామ సభ, సర్వసభ్య సమావేశం వివరాలు తెలుసుకున్నారు. మాల్దీవ్స్ బృందంతో డీపీఓ సురేష్ మోహన్, ఎంపీడీఓ బన్సీలాల్, మండల పంచాయతీ అధికారి హరిశంకర్ గౌడ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి నీలిమ, పాశమైలారం కార్యదర్శి రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.



కర్దనూర్ పంచాయతీ వద్ద మాల్దీవ్ బృందంతో అధికారులు

ఒకరికి పాజిటివ్

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా ఆస్పత్రిలో గురువారం 23 మందికి కరోనా ర్యాపిడ్ యాంటీజెన్ పరీక్షలు చేయగా అందులో ఒకరికి పాజిటివ్ నిర్ధారణ అయిందని డాక్టర్లు తెలిపారు.

నేటి నుంచి దివ్యాంగుల బస్‌పాస్‌ల మేళా

రాయదుర్గం: గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలో దివ్యాంగుల సౌకర్యార్థం ‘దివ్యాంగుల బస్‌పాస్‌ల స్పెషల్ మేళా’ను నిర్వహించడం జరుగుతుందని టీఎస్ ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్ కృష్ణకాంత్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాస్‌లు జారీ చేస్తారన్నారు. బస్‌పాస్ పొందటానికి పాస్‌పోర్టు సైజ్ ఫొటో, సదరం సర్టిఫికెట్ కాపీ, ఆధార్‌కార్డు, ఐడీకార్డు తీసుకు రావాలని, సర్వీస్‌చార్జీ కిందరూ.50ల రుసుముతో సంప్రదించాలన్నారు. శుక్రవారం (10వ తేదీ) పటాన్‌చెరు బస్‌పాస్ కేంద్రం, సోమవారం (13వ తేదీ) దిల్‌సుఖ్‌నగర్, బుధవారం (15వ తేదీ) ఇబ్రహీంపట్నం, శుక్రవారం(17వ తేదీ) మెహిదీపట్నం, సోమవారం (20)వ తేదీ సీబీఎస్‌లోని బస్‌పాస్ కేంద్రంలో మేళా జరుగుతుందన్నారు.

బోర్లు.. బాగు చేస్తే మేలు





హుడా కాలనీలో నిరుపయోగంగా ఉన్న చేతి పంపులు



ఎంఏనగర్ కాలనీలో..

మియాపూర్: బస్తీలు, కాలనీల్లోని చేతి బోర్లు వృథాగా మారాయి. పైప్‌లైన్ల ద్వారా ఇంటింటికీ తాగునీరు సరఫరా అవుతుండడంతో నిరుపయోగంగా మారాయి. చందానగర్, మియాపూర్ డివిజన్ల పరిధిలోని ఇందిరానగర్, శాంతినగర్, వేముకుంట, జవహర్ కాలనీ, వేమన వీకర్ సెక్షన్, న్యూ కాలనీ, బాలాజీనగర్, ఎఫ్‌సీఐ కాలనీ, లక్ష్మీనగర్, వీడియో కాలనీ, పీఏనగర్, ఎంఏనగర్, స్టాలిన్‌నగర్, హుడా కాలనీ తదితర కాలనీల్లో చేతి పంపులు తుప్పుపట్టాయి.

- బస్తీలు, కాలనీల్లో రెండు రోజులకు ఒకసారి మంచినీరు సరఫరా చేస్తున్నారని, ఈ నీరు చాలడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలలో బోరింగ్‌లు బాగు చేస్తే వాటిని ఇతర అవసరాలకు వాడుకునే వారమని అంటున్నారు. వేసవిలో నీటి కొరత ఏర్పడుతోందని వీటిని బాగు చేస్తే ప్రత్యామ్నాయంగా ఉంటాయని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.